ప్రజాశక్తి

శుక్రవారం 8 ఆగస్టు 2025 5 విజయనగరం

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బ్యాంకు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఐడిబిఐ బ్యాంకు అధికారులు, ఉద్యోగులు ఈ నెల 11న చేపడుతున్న సమ్మెకు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి పి.శంకరరావు, కె.సురేష్ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం బ్యాంకులో సుమారు రూ.3 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయని, బ్యాంకును ఒక ప్రయివేట్ ఇన్వెస్టర్‌కు విక్రయిస్తే, ప్రజల పొదుపులు మొత్తం వారి చేతికి వెళ్లాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం మాట్లాడుతున్న ఆత్మనిర్భర్ భారత్ ఇదేనా? అని ప్రశ్నించారు. ఐడిబిఐ ఉద్యోగులు, అధికారుల సమ్మెకు ఎల్‌ఐసి, ఇతర వాణిజ్య బ్యాంకుల ఉద్యోగులు, ఖాతాదారులు సంపూర్ణ మద్దతునివ్వాలని కోరారు.

ఆ ఫోన్లు మాకొద్దు బాబోయ్

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని తానే పరిచయం చేశానన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. అంగన్వాడీలతో పాతతరం ఫోన్లతో పని చేయిస్తున్నారు. ఎఐ, ఐటి టెక్నాలజీని తానే అందించానన్న చంద్రబాబుకు ఈ ఒక్క లాజిక్ తెలియకపోవడం పొరపాటే. బాల సంజీవని యాప్, ఎఫ్ఆర్ఎస్, ఆధార్ కార్డు లింక్ వంటి పనులన్నీ పాతతరం ఫోన్‌తో సాధ్యం కాకపోవడంతో అంగన్వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అంగన్వాడీలు రాష్ట్ర వ్యాప్తంగా పోరుబాట పట్టాల్సి వచ్చింది. తమ సెల్‌ఫోన్లను సిడిపిఒ కార్యాలయాల్లో పెట్టేసి.. విజయనగరం జిల్లాలో 11 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2206 కేంద్రాల్లో అంగన్వాడీలు నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు.

పాత తరం ఫోన్లను సిడిపిఒ కార్యాలయాల్లో అప్పగిస్తున్న అంగన్వాడీలు (ఫైల్)

- ఆందోళన బాటలో అంగన్వాడీలు
- సిడిపిఒ కార్యాలయాల్లో పాతతరం ఫోన్లు అప్పగింత
- రికార్డులతోనే నిర్వహణ
- ఎటూ తేల్చని అధికారులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అంగన్వాడీ కేంద్రాల్లో కేంద్ర ప్రభుత్వం ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని తీసుకొచ్చింది. అంగన్వాడీ కేంద్రాల ద్వారా టేక్ హోం రేషన్ సేవలు పొందాలంటే దీనిని తప్పనిసరి చేశారు. అందుకోసం అంగన్వాడీలు మొబైల్ ఫోన్ ద్వారా పోషణ్ యాప్‌లో లబ్ధిదారుల వివరాలను తప్పనిసరిగా ముఖ గుర్తింపు విధానంలో పొందుపరచుకోవాలి. ఎఫ్ఆర్ఎస్‌లో రిజిస్టర్ కాకుంటే, వారికి టేక్ హోం రేషన్ ఇవ్వడం సాధ్యం కాదు. ఇలాంటి పనులన్నీ చేస్తున్న అంగన్వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం 2జి ఫోన్లను మంజూరు చేసింది. వీటితో ఎఫ్ఆర్ఎస్ చేయలేక అంగన్వాడీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని ఐసిడిఎస్ సిడిపిఒలు, పీడీ, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఎఫ్ఆర్ఎస్‌ను పూర్తి చేయాలని సంబంధిత అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. లక్ష్యం పూర్తిచేయాలని, ఎఫ్ఆర్ఎస్ పూర్తికాని లబ్ధిదారులను తొలగించాలని సిడిపిఒలు అంగన్వాడీలపై ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో ఎఫ్ఆర్ఎస్ పూర్తికాని లబ్ధిదారులకు టేక్ హోం రేషన్ అందడం లేదు. దీంతో అంగన్వాడీలు, లబ్ధిదారుల మధ్య గొడవలు చోటుచేసుకున్నాయి. పిల్లలకు పౌష్టికాహారం, విద్యా బోధన కంటే ఈ యాప్‌లతోనే ఇబ్బంది పడుతున్నామన్న వాదన వారి నుంచి వినిపిస్తోంది

మరోవైపు సిడిపిఒల నుంచి వేధింపులు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు ఆందోళన బాటపట్టారు. జిల్లాలో ఉన్న 11 ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు 'పనిచేయని ఈ సెల్‌ఫోన్లు మాకొద్దు బాబు' అంటూ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అంతే కాదు.., ఆ సెల్‌ఫోన్లను సిడిపిఒ కార్యాలయంలో పెట్టేశారు. 5జి ట్యాబ్, వైఫై కనెక్షన్ ఇవ్వాలని అంగన్వాడీలు కోరుతున్నారు. అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్ కింద మార్చి, అంగన్వాడీ వర్కర్లకు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఒత్తిడికి గురవుతున్నాం

ఎఫ్ఆర్ఎస్ విధానం వల్ల అంగన్వాడీలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. అంగన్వాడీలు, లబ్ధిదారుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. జిల్లాలోని 11 ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయాలకు అంగన్వాడీల సెల్‌ఫోన్లు అప్పగించాం. అంగన్వాడీల్లో రిజిస్టర్లను నిర్వహిస్తూ, రికార్డులు రాస్తున్నాం. పీడీ, సిడిపిఒలు ఇంతవరకూ యూనియన్‌ను సంప్రదించలేదు. యూనియన్ రాష్ట్ర కమిటీ నిర్ణయం ప్రకారం భవిష్యత్తు కార్యాచరణ ఉంటుంది.

\- ఎస్.అనసూయ, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

నెల రోజుల్లో కొత్త ఫోన్లు వస్తాయి

ప్రభుత్వం నెల రోజుల్లో కొత్త ఫోన్లను అందిస్తుంది. జిల్లాలోని 11 ప్రాజెక్టు కార్యాలయాల్లో అంగన్వాడీలు సెల్‌ఫోన్లను విడిచిపెట్టేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

\- టి.విమలరాణి, పీడీ, ఐసిడిఎస్

ముర్రుపాలు అమృత తుల్యం

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ • ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, ఎమ్మెల్సీ రఘురాజు, డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

బిడ్డ పుట్టిన వెంటనే ఐదు నిమిషాలలోపు తల్లి ఇచ్చే ముర్రుపాలు ఎంతో అమూల్యమైనవని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ఆ పాలలో అద్భుతమైన పోషకాలు, ఔషధ గుణాలు ఉంటాయని, అవి బిడ్డ ఆరోగ్యానికి, ఎదుగుదలకు మహోపకారం చేస్తాయని తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు బిడ్డకు పాలు అందించేందుకు బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఐసిడిఎస్, ఇతర శాఖల సమన్వయంతో ముందుగా ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, కలెక్టరేట్‌లో బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే ఉంటే, వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామన్నారు. బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జిల్లా పరిషత్ ఐదో స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ శాంతికుమారి, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ హిమబిందు మాట్లాడారు. గర్భిణులకు సామూహిక సీమంతాలను నిర్వహించారు. ఐసిడిఎస్ పీడీ టి.విమలారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, మెప్మా పీడీ చిట్టిరాజు, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి అన్నపూర్ణ, బిసి సంక్షేమాధికారి జ్యోతిశ్రీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ కవిత, నేచర్ డైరెక్టర్ వికాశ్, ఘోషా ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ముందు కౌన్సిలింగ్ అవసరం

ప్రతీ జంటకు వివాహానికి ముందు కౌన్సిలింగ్ అవసరమని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. దీనికోసం జిల్లా కేంద్రంలోని సఖి- వన్‌స్టాప్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రీ మేరిటల్ కౌన్సిలింగ్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సెంటర్‌కు ద్వారా అందిస్తున్న సేవలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, జెడ్‌పి ఐదో స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ శాంతకుమారి, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ హిమబిందు, ఐసిడిఎస్ పీడీ టి.విమలారాణి, వన్‌స్టాప్ సెంటర్ ఇన్‌ఛార్జి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రత్యేక విద్యకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సాధారణ విద్యార్థులతో పాటు ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో విద్యాశాఖ ప్రత్యేక విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని డిఇఒ యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఎపిసి ఎ.రామారావు అన్నారు. ఇటీవల చత్తీస్‌గడ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో మేధో వైకల్యం గల ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు జాతీయస్థాయి స్పెషల్ ఒలింపిక్ గేమ్స్ నిర్వహించారు. ఈ జాతీయస్థాయి పోటీలలో రాష్ట్రం తరపున జిల్లాలోని తెర్లాం ఉన్నత పాఠశాలకు చెందిన అడ్డా తోషిని కాంస్య పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా గురువారం విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఉన్నతాధికారులు తోషినిని అభినందించారు. విద్యార్థినికి కోచ్‌లుగా వ్యవహరించిన పి.సునీల్, ఎన్.బంగారు నాయుడును కూడా అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్.సూర్యారావు, సహా సమన్వయకర్త ఎం.భారతి, తెర్లాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ఎం రమేష్ పాల్గొన్నారు.

నాటు తుపాకుల ఏరివేతే లక్ష్యం

ఎస్‌పి వకుల్ జిందల్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నాటు తుపాకుల ఏరివేత, గంజాయి, నాటు సారా నియంత్రణే లక్ష్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ముందుగా గుర్తించిన గిరిజన గ్రామాల్లో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని అధికారులను ఎస్‌పి వకుల్ జిందల్ ఆదేశించారు. జిల్లా పోలీసు అధికారులతో ఎస్‌పి గురువారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నాటు తుపాకులు కలిగి ఉండడం, లైసెన్సు లేకుండా తుపాకుల వినియోగించడం చట్టరీత్యా నేరమన్న విషయాన్ని గ్రామస్తులకు అర్థమయ్యే రీతిలో వివరించి, అవగాహన కల్పించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అడవి పందుల నుండి పంటలను రక్షించుకొనేందుకు, అడవి పందులను వేటాడేందుకు కొంతమంది నాటు తుపాకులను అనధికారంగా వినియోగిస్తున్నట్లుగా పోలీసుల దృష్టికి వచ్చిందన్నారు.

క్షేత్ర స్థాయిలో నాటు తుపాకులు వినియోగించే వ్యక్తుల సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ఇందుకు గ్రామ స్థాయిలో నిఘా ఏర్పాటు చేయాలని, మహిళా సంరక్షణ పోలీసులు, దత్తత గ్రామాల పోలీసు సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. గ్రామ సందర్శనలు చేసే సమయంలో నాటు తుపాకులు కలిగి ఉండడం ఇండియన్ ఆర్మ్స్ యాక్టు ప్రకారం తీవ్రమైన నేరం పరిగణించనున్న విషయాన్ని గిరిజనులు, గ్రామస్తులకు అర్థమయ్యే రీతిలో తెలపాలన్నారు. ఎవరి వద్దనైనా నాటు తుపాకీ ఉంటే, స్వచ్ఛందంగా అప్పగించాలని తెలిపారు. కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్‌లో ఎవరి వద్దనైనా నాటు తుపాకులు పట్టుబడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, జి.భవ్యరెడ్డి, ఎస్.రాఘువులు, పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

రహదారులపై ఆక్రమణలు తొలగించాలి : జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

సమావేశంలో మాట్లాడుతున్న జెసి సేతు మాధవన్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రహదారులపై ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, రహదారులపై ఆక్రమణలు తొలగించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాన్ని గురువారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించారు. సమావేశంలో జెసి మాట్లాడుతూ రహదారిపై ప్రమాదాల నివారణకు చేపట్టవలసిన చర్యలు తీసుకోవడమే కాకుండా, నిబంధనలను కఠినంగా అమలు చేయాలన్నారు. రహదారులు, జంక్షన్లు, బ్లాక్ స్పాట్స్, పాఠశాలల వద్ద ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఐఆర్‌ఎడి యాప్‌లో రోడ్డు ప్రమాద వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఐఆర్‌ఎడి యాప్‌పై అన్ని శాఖల అవగాహన కోసం జూమ్ మీటింగ్ నిర్వహించాలని సూచించారు. ఆర్అండ్‌బి, పోలీసు, రవాణా, పంచాయతీరాజ్ శాఖల సంయుక్త బృందాలు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గత సమావేశం నుంచి ఇప్పటివరకు పెండింగ్ ఉన్న కేసులను తక్షణమే క్లియర్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పి సౌమ్యలత, ఆర్అండ్‌బి ఎస్ఇ కె.కాంతిమతి, డిసిహెచ్ఎస్ పద్మశ్రీరాణి, విజయనగరం, బొబ్బిలి కమిషనర్లు నల్లనయ్య, రామలక్ష్మి, ఎంవిఐ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

10న బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల పదో తేదిన లక్కవరపుకోటలో జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్షులు టి.శ్రీనివాసరావు, కార్యదర్శి జి.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్, సీనియర్ బాలబాలికల విభాగాల్లో ఎంపికలు చేపడుతున్నట్లు చెప్పారు. వివరాలకు 9052457201, 9581886936 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గురువారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ రిటైర్ అయిన 15 మంది స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని కోరారు. చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను నియమించాలని కోరారు. పర్మినెంట్ కార్మికులకు నాలుగేళ్ల సరెండర్ లీవులను కార్మికుల ఖాతాల్లో జమయ్యేలా చూడాలని విజ్ఞప్తిచేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎఐటియుసి నాయకులు రంగరాజు, కామేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

మద్యం సేవించి విధులకు..

ప్రజాశక్తి-వంగర

మద్యం మత్తులో ఉన్న తహశీల్దార్ రమణారావు

ఆయనో ఉన్నతోద్యోగి. అంతకుమించి మండలానికి మెజిస్ట్రేట్. అవన్నీ మరిచిపోయి మద్యం మత్తులో తూగుతూ, తూలుతూ విధులకు హాజరయ్యారు. ఈ సంఘటన వంగర మండలంలో గురువారం చోటుచేసుకుంది. వంగర తహశీల్దార్ హరి రమణారావు.. గురువారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో తన కార్యాలయంలో విధుల్లో ఉంటూ, మద్యం మత్తులో ఊగిస లాడుతున్నారు. ఆయన కార్యాలయ గది బయట తాళం వేసి ఉంది. ఈ విషయం బయటకు పొక్కడంతో మీడియా తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుంది. ఇదే విషయమై ఆయన్ను మీడియా ప్రశ్నించగా, తానేమీ మద్యం సేవించలేదని బుకాయిస్తూ అక్కడి నుంచి బయటకు వెళ్లిపోయారు. ఈ విషయమై చీపురుపల్లి ఆర్‌డిఒ ఆశియ్యను వివరణ కోరగా, మద్యం సేవించి విధులకు హాజరుకావడం నేరమని చెప్పారు. తహశీల్దార్ రమణారావు మద్యం తాగి, విధులకు హాజరైన విషయాన్ని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. తహశీల్దార్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చామని, సోమవారం కలెక్టర్ వద్ద హాజరుకావాలని ఆదేశించామని చెప్పారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

మాట్లాడుతున్న జిల్లా జడ్జి బబిత

సెప్టెంబర్ 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత కోరారు. బార్ అసోసియేషన్ సభ్యులు, ప్రభుత్వ, ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులతో, వాదిప్రతివాదుల న్యాయ వాదులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాద బీమా క్లెయిమ్ కేసులు, అన్ని సివిల్ దావాలు.. వచ్చే నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. ఎక్కువ కేసులు రాజీ చేసి కక్షిదారులకు డబ్బు, సమయం వృథా కాకుండా చూడాలన్నారు. సమావేశంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కలిశెట్టి రవిబాబు, కార్యదర్శి సురేష్, సీనియర్ న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

డిపిటిసిని సందర్శించిన ఎస్‌పి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మంచాలను పరిశీలిస్తున్న ఎస్‌పి వకుల్ జిందల్

సారిపల్లిలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రాన్ని ఎస్‌పి వకుల్ జిందల్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. డిపిటిసిలోని తరగతి గదులను, కార్యాలయం, వంట గది, డైనింగు హాల్, స్టోరురూం, వాష్ రూములు, స్నానపు గదులను, మినరల్ వాటర్ ప్లాంట్, లైబ్రరీ, పరేడ్ గ్రౌండు, ఫైరింగు రేంజ్‌లను ఎస్‌పి పరిశీలించారు. శిక్షణ కేంద్రంలో మంచాలు, పరుపులు, క్రీడా సామగ్రి, టేబుల్స్, కంప్యూటర్లు, ఫ్యాన్లు వినియోగంలోకి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి త్వరలో సుమారు 150 మంది ట్రెయినీ కానిస్టేబుళ్లు శిక్షణకు రానుండటంతో వారికి అవసరమైన వసతులు కల్పించాలని ఆదేశించారు. శిక్షణ కూడా వచ్చే నెలలోనే ప్రారంభం కానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, ఎఆర్ ఎఎస్‌పి జి.నాగేశ్వరరావు, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, భోగాపురం సిఐ జి.రామకృష్ణ, డిపిటిసి సిఐ బి.లలిత, ఆర్ఐ జి.గోపాలనాయుడు, నెల్లిమర్ల ఎస్ఐ గణేష్ పాల్గొన్నారు.

బిసిలపై దాడులు చేయిస్తున్న చంద్రబాబు

వైసిపి ఆధ్వర్యాన నిరసన

పూలే విగ్రహం వద్ద నిరసన చేపడుతున్న వైసిపి అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

బిసిలపై రౌడీలు, గూండాలతో సిఎం చంద్రబాబునాయుడు దాడులు చేయిస్తున్నారని వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు మహంతి జనార్ధన్ ఆరోపించారు. కడప జిల్లా పులివెందులలో ఎమ్మెల్సీ రమేష్ కుమార్ యాదవ్‌పై దాడికి వ్యతిరేకంగా గురువారం విజయనగరంలోని జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి ఎమ్మెల్సీ ఓట్లు అడిగినంత మాత్రాన ఇలాంటి దాడులు చేయడం తగదన్నారు. చంద్రబాబు బిసిలతో పెట్టుకుంటే బంగాళాఖాతంలో కలిపేస్తారని హెచ్చరించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేక చంద్రబాబు ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ రమేష్ కుమార్ యాదవ్ పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బమ్మిడి అప్పలనాయుడు, బొమ్మి శ్రీను, ఉపాధ్యక్షుడు బర్రి చిన్నపన్న, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శులు వర్రి నరసింహమూర్తి, సంగం రెడ్డి బంగారు నాయుడు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అల్లు అవినాష్, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు

ఆర్థికాభివృద్ధి చెందాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

డిజి లక్ష్మి పథకం ద్వారా పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి

డిజి లక్ష్మి పథకంతో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో డిజి లక్ష్మి పథకాన్ని లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కియోస్క్ సెంటర్లను ప్రారంభించారు. దీనికి రూ.2 లక్షల వరకు బ్యాంకు రుణమిచ్చి, కంప్యూటర్, స్కానర్ అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ పథకంతో మహిళలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో సిఎంఒ సన్యాసిరావు పాల్గొన్నారు.

44వ డివిజన్‌లో ఎసి పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 44వ డివిజన్‌లో సహాయ కమిషనర్ కె.అప్పలరాజు గురువారం పర్యటించారు. స్థానికులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. డివిజన్‌లో పర్యటించి ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో వాటిని గుర్తించారు. ముఖ్యంగా కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు చెప్పడంతో వెంటనే వాటి మరమ్మతులను పూర్తి చేసి తక్షణమే వెలిగేటట్లు చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కాలువలు, రహదారి సమస్యలు వంటివి ఆయన దృష్టికి వచ్చాయి. కార్యక్రమంలో ఎఇ సీతారామమూర్తి, టిపిఒ అప్పలరాజు పాల్గొన్నారు.

సిఎంకు నాయీబ్రాహ్మణుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకుందని సిఎం చంద్రబాబునాయుడుకు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంద్రేటి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం సెలూన్ షాపులకు 200 యూనిట్లు కరెంట్ ఉచితంగా ఇచ్చి, తమపై ఆర్థిక భారం తగ్గించారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజుకూ కృతజ్ఞతలు తెలియజేశారు.

సదస్సులో మాట్లాడుతున్న డిఎస్‌పి భవ్యరెడ్డి

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

రోడ్డు ప్రమాదాలు నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డిఎస్‌పి భవ్యరెడ్డి కోరారు. స్థానిక శ్రీకళా భారతి ఆడిటోరియంలో గురువారం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. లైసెన్స్, వాహన అనుమతి పత్రాలు లేకుండా ఆటోలను నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పరిమితికి మించి ఆటోలలో ప్రయాణికులను ఎక్కించవద్దని కోరారు. మితిమీరిన వేగంతో ఆటోలను నడపడంతో ప్రమాదాలు జరుగుతాయని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్, ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ ఉన్నారు.

ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న మహేష్, తదితరులు

గ్రంథాలయంలో ఠాగూర్ వర్థంతి

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక శాఖా గ్రంథాల యంలో గురువారం విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి గ్రంథాల యాధికారి మహేష్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత విశేషాలు - బొమ్మలతో అనే పుస్తకం ప్రదర్శించారు. అతని జీవిత విశేషాలు, సాహిత్యానికి సంబంధించిన విషయాలు, ఆయన రచనలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో రైతుల్లో ఆనందం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి, చిన్నయ్యపేట, ఉంగరాడమెట్ట తదితర గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం పడింది. ఉదయం ఉక్క పూతతో ప్రజలు అల్లాడిపోతున్న సమయంలో ఒక్కసారిగా మేఘామృతం కావడంతో వాతావరణం చల్లబడి భారీ వర్షం పడింది. ఎండలకు వరి పంటలు, మొక్కజొన్న ఎండిపోతున్న సమయంలో ఇలా భారీ వర్షం పడడం రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఎండిపోతున్న పంట పొలాలకు మోటార్లుతో నీరు తోడుదామనుకున్న సమయంలో ఇలా వర్షం పడడంతో కొంత సొమ్ము ఆదా అయిందని రైతులు తెలిపారు.

వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

నాటు తుపాకీతో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - వేపాడ

వల్లంపూడి ఎస్ఐ సుదర్శన్‌కు వచ్చిన సమాచారం మేరకు సోంపురం గ్రామానికి చెందిన గొర్లి ఈశ్వరరావు ఇంటిలో గురువారం సోదాలు నిర్వహించారు. ఇంట్లో నాటు తుపాకీ ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు విఆర్ఒతో కలిసి తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఇంట్లో నాటు తుపాకీ దొరికిందనీ, ఈ తుపాకీ ఎక్కడిది అని అడుగ్గా గుడివాడ గ్రామానికి చెందిన రొంగలి బంగారయ్య అనే వ్యక్తి వద్ద రూ.4500కు కొన్నానని ఈశ్వరరావు అంగీకరించారన్నారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులూ లేకుండా నాటు తుపాకీ కలిగి ఉండట, అమ్మడం చట్టరీత్యా నేరమని ఇద్దరినీ ఎస్‌కోట రూరల్ సిఐ ఆధ్వర్యంలో అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ మోసాలపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ఎన్నికల హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

ఎన్నికల హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలోని 19వ వార్డులో గురువారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

రైతు సేవలు అగమ్యగోచరం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో మీ సేవా కేంద్రాలు, రైతు సేవా కేంద్రాలు, సచివాలయ కేంద్రాల్లో రైతు సేవలు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ కేంద్రాలు ఎక్కడా తెరుచుకోకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల అన్నదాత సుఖీభవ పథకం ద్వారా వేలాది మందికి అనేక కారణాల వల్ల డబ్బులు పడలేదు. ఈ నేపథ్యంలో అన్నదాత సుఖీభవ పథకం, ఇతరత్రా పథకాల డబ్బులు పడని వారికి ఆయా కేంద్రాల్లో సంబంధిత ధ్రువపత్రాలతో నమోదు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఆయా కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. అయినప్పటికీ ఆయా కేంద్రాల వద్ద సిబ్బంది కానరావడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

సుఖీభవ పథకం వచ్చేటట్టు చూడండి

అన్నదాత సుఖీభవ పథకానికి అన్ని అర్హతలు ఉన్నాయి. పథకం డబ్బులు పడలేదు. ఈ పథకానికి డబ్బులు పడాలంటే రైతు సేవా కేంద్రంలో ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని చెప్పారు. ఆయా కేంద్రాల్లో నమోదు చేసేందుకు వెళ్తే ఎవరూ లేని పరిస్థితి నెలకొంది. దీంతో మెంటాడ మీ సేవా కేంద్రంలో డబ్బులు చెల్లించి చేసుకోవాల్సి వచ్చింది.

- బడుకొండ సింహాచలం, మెంటాడ

11న కలెక్టరేట్ వద్ద ఆటో డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి- రాజాం

మహిళలకు ఉచిత బస్సు నేపథ్యంలో ఆటో కార్మికులను ఆదుకోవాలని ఆగస్టు 11న సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో అందరూ పాల్గొనాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. శంకరరావు, కె.సురేష్ డిమాండ్ చేశారు. రాజాం పట్టణంలో ఆటో డ్రైవర్స్‌తో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆటో రంగ కార్మికులకు జీవో నెంబర్ 21 ద్వారా పెద్ద ఎత్తున ఫీజులు పెనాల్టీలు వసూలు చేస్తున్నారని ఇవి ఇబ్బందికరంగా ఉన్నాయని వీటిపై తమ ప్రభుత్వం రాగానే జీవో నెంబర్ 21 సవరించి ఫీజులు పెనాల్టీలు తగ్గిస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారం వచ్చి సంవత్సరం పూర్తయిన జీవో పై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. వీటన్నిటికి తోడు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచడం ద్వారా డ్రైవర్ల జీవనం ఇబ్బందికరంగా ఉందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విధించే ట్యాక్స్‌లు భారంగా ఉన్నాయని అన్నారు. ఆటోలు, రవాణా వాహనాలు ఫిట్నెస్ టెస్టులకు సంబంధించి గతంలో నేరుగా ప్రభుత్వమే నిర్వహించేదని ఇప్పుడు ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషను పేరుతో ప్రైవేటు వారికి అప్పజెప్పి డ్రైవర్లపై అధిక భారాలు మోపుతున్నారన్నారు. ప్రభుత్వమే నేరుగా ఫిట్నెస్ టెస్టులు చేయాలని ప్రయివేటుకు అప్పగించొద్దని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకానికి తాము వ్యతిరేకం కాదని, కానీ మహిళలకు ఉచిత బస్సు అమలు జరిగితే తమ రోజువారి కిరాయిలు కూడా ఇప్పటికే ఫైనాన్స్‌లు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామని, ఉచిత బస్సు అమలు జరిపే క్రమంలో ప్రత్యామ్నాయంగా డ్రైవర్లు ఆదుకోవడం కోసం ప్రభుత్వం ప్రణాళిక రూపొందించాలని కోరారు. జీవో నెంబర్ 21 రద్దు కోసం భవిష్యత్తులో ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.త్రినాద్, ఆటో యూనియన్ నాయకులు రఘు, డీ.ఎస్.ఆర్.మూర్తి, రాజు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు, డ్రైవర్లు

పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

కమిషనర్ ఆగ్రహం

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపాలిటీలో పేరుకుపోయిన అపారిశుధ్యంపై మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగవీధిలో పారిశుధ్య పనులను గురువారం పరిశీలించారు. రోడ్డు పక్కన చెత్త, కాలువలలో పూడికలు పేరుకుపోవడంతో పారిశుధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు పక్కన చెత్తను తొలగించి కాలువలను శుభ్రం చేయాలని పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థి సంఘాల నిషేధం అన్యాయం

బొబ్బిలి: విద్యారంగ సమస్యల పరిష్కారం చేయమంటే విద్యార్థి సంఘాల నిషేధం అన్యాయమని, పాఠశాలలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడం సిగ్గుచేటు అని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఇ. చినబాబు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రి కొడుకే ప్రత్యక్షంగా బాధ్యతలు తీసుకుంటే ఎంతో కొంత విద్యా వ్యవస్థ గాడిన పడుతుందనుకున్నాం కానీ అధికారం చేపట్టి సంవత్సరం గడిచేలోపు అనేక దుర్మార్గ విధానాలతో విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారన్నారు. ఆగస్టు ఒకటిన రాష్ట్ర ప్రభుత్వం ఆర్సి నెంబర్ 30/67/2025ని తీసుకువచ్చిందని ఈ సర్క్యులర్ సారాంశం పాఠశాలల్లోకి పేరెంట్స్, ఎస్ఎంసి సభ్యులు మినహా ఇతరులు ఎవరూ రాకూడదని ఉందని గుర్తు చేశారు. కేవలం పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలను నిషేధించడానికే ఈ సర్క్యులర్ తెచ్చారని దీన్ని ఖండిస్తున్నామని అన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యం

ప్రజాశక్తి- డెంకాడ(భోగాపురం)

తల్లి పాలతో అప్పుడే పుట్టిన బిడ్డలకు ఎంతో ఆరోగ్యమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గురువారం భోగాపురం ఐసిడిఎస్ కార్యాలయంలో గర్భిణులకు తల్లి పాలు ప్రాముఖ్యత గురించి ఎసిడిపిఒ సుజాత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రసవానంతరం గంటలోపు తాగించే తల్లి పాలు బిడ్డలకు అమృత తుల్యమని అన్నారు. పిల్లలు పుట్టిన మూడు నుండి ఆరు వారాల వరకు ముర్రుపాలు పట్టించాలన్నారు. ఇవి కేవలం ఆకలి తీర్చడమే కాకుండా బిడ్డకు దీర్ఘాయుస్సు నిచ్చే అమృత దారలని తెలిపారు. చాలా మంది రకరకాల అపోహలతో బిడ్డలకు తల్లిపాలు దూరం చేస్తున్నారన్నారు. అపోహలు మాని బిడ్డలకు తల్లిపాలు రెండు సంవత్సరాలు వరకు అందించాలన్నారు. అంగన్వాడీలు, ఆయాలు తల్లిపాల గురించి విస్తృతంగా గర్భిణులకు, బాలింతలకు అవహగానా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గాయత్రి, వైస్ ఎంపిపి నాగలక్ష్మి, సర్పంచ్ అప్పయ్యమ్మ, మండల జనసేన నాయకులు, ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, పోలిపల్లి వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: గర్భిణీకి సీమంతం చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

తెర్లాం: మండలంలోని గురువారం తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. పెరుమాలి, జగన్నాధవలస, తెర్లాం, కొరటాం, లోచర్ల సెక్టార్లలో ముగింపు కార్యక్రమాలను చేపట్టారు. ఐసిడిఎస్ పిఒ వరాహాలమ్మ మాట్లాడుతూ వారు రోజులు పాటు తల్లిపాలు వారోత్సవాలను ఘణంగా నిర్వహించామన్నారు. తల్లిపాలు వల్ల శిశువు కలిగే ప్రయోజనాలను వివరించారు. పుట్టిన వెంటనే శిశువుకు తల్లి పాలు పెట్టడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతోందన్నారు. అంగన్వాడి సేవలు అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్‌వైజర్ అపర్ణ, ఈశ్వరమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం దమయంతి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మాట్లాడుతున్న పిఒ వరహాలమ్మ

కాలువల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణ కేంద్రంలో విశాఖపట్నం - అరకు ప్రధాన రహదారికి ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర నుంచి దేవి టెంపుల్ వరకు రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్న కారణంగా డ్రైనేజీ పనుల నిమిత్తం ఎన్‌ఆర్ఇజిఎస్ నిధులు రూ.95లక్షలతో పనులు ప్రారంభించామన్నారు. పట్టణం సుందరీకరణ టౌన్‌గా అభివృద్ధి చేసుకుందామని భవిష్యత్తు రోజుల్లో కూడా ప్రజల ఆమోదంతో మరింత అభివృద్ధి చేసుకునేందుకు వీలుగా దృష్టి పెడతానని తెలిపారు. చిన్న చిన్న వ్యాపారస్తులకు జరిగిన ఇబ్బందులను పంచాయతీ, ఆర్అండ్‌బి లిమిట్స్‌ను దృష్టిలో పెట్టుకొని రానున్న రోజుల్లో వారికి సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వ్యాపారస్థులను ఇబ్బందులు పెట్టే ఉద్దేశం తమకు లేదని వర్షాలు పడడం వల్ల రోడ్డుపై నీరు చేరి పట్టణ, నియోజకవర్గం ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఈ కార్యక్రమానికి వ్యాపారస్తులందరూ సహకరించాలని రానున్న రోజుల్లో తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి, మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, టౌన్ పార్టీ అధ్యక్షులు నానిగిరి రామనాజీ, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

అర్హులకు సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే ఎమ్మెల్యే లోకం నాగమాదవి అన్నారు. గురువారం ఆమె తమ్మాపురం గ్రామాన్ని సందర్శించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు తల్లికి వందనం, వృద్ధాప్య పింఛన్లు, అన్నదాత సుఖీభవ పథకాల్లో లోపాలు ఉన్నాయని, డ్రైనేజీ సమస్యలు, రోడ్ల దుస్థితి అధికంగా ఉన్నాయని గ్రామస్తులు విన్నవించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, అక్కడి ఆహార నాణ్యత, పిల్లలకు అందుతున్న సేవల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రైనేజీ శుభ్రత, రోడ్ల మరమ్మతులు, శానిటైజేషన్ కార్యకలాపాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చనమల్ల వెంకటరమణ, అంబళ్ల అప్పలనాయుడు, యడ్ల గోవిందరావు, గదల అచ్చుంనాయుడు, కరుమజ్జి గోవింద అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాధవి

చేనేతకు చేయూతనిద్దాం

ప్రజాశక్తి- బొబ్బిలి

నిండైన భారతీయతకు నిజమైన అందాన్నిచ్చే చేనేతకు చేయూత నిచ్చి నేతన్నను బతికించి చేనేత రంగాన్ని బతికించుకోవలసిన భాద్యత ప్రతివారిపై ఉందని రోటరీ జిల్లా అధ్యక్షులు జెసి రాజు పిలుపునిచ్చారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం నేపథ్యంలో స్థానిక అర్‌సిఎమ్ చర్చ్ వద్ద ఉన్న చేనేత కాలనిలో నివసిస్తున్న చేనేత కార్మికులతో చేనేత దినోత్సవాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీహరి, కార్యదర్శి శివకాంత్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ స్వాతంత్య ఉద్యమంలో దేశాన్ని ఏకం చేసినది చేనేత రంగమేనని అన్నారు. చేనేత భారతీయ సంస్కృతికి, సంప్రదాయానికి, గౌరవానికి, హుందాతనానికి చిహ్నంగా నిలుస్తుందన్నారు. కాలక్రమంలో పవర్ మగ్గాలు రావటంతో క్రమేపీ చేనేత వస్త్రాలు తమ ప్రాభవాన్ని కోల్పోయాయని అన్నారు. నేత కార్మికులు ఆకలితో అలమటించాల్సిన పరిస్థితులు చోటుచేసు కున్నాయని, ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలున్నా యన్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో కూడా చేనేతను నమ్ముకున్న కార్మికుల కృషితో చేనేత వస్త్రాలు వాన్ డిస్ట్రిక్ట్ వాన్ ప్రొడక్ట్ కింద ప్రథమ స్థానాన్ని పొందటం గర్వించాల్సిన విషయమన్నారు. కూటమి ప్రభుత్వం చేనేత రంగాన్ని నిలబెట్టేలా తీసుకుంటున్న చర్యలు ఆహ్వానించదగినవని అన్నారు. ఉచిత విద్యుత్, చేనేత సొసైటీలకు త్రిఫ్ట్‌ఫండ్ సమకూర్చడం, చేనేత వస్త్రాలకు జిఎస్‌టి మినహాయించటం గిట్టుబాటు ధర కల్పించటం తదితర చర్యలు ప్రభుత్వం తీసుకోవడంతో చేనేతకు మంచిరోజులు వస్తాయన్నారు. రోటరీ సభ్యులు చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి ధరించేలా కృషి చేస్తామన్నారు. అనంతరం 25 చేనేత కార్మికుల కుటుంబాలకు స్వీట్ పాకెట్స్‌ను పంచి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ కమ్యూనిటీ చైర్మన్ గెంబలి శ్రీనివాసరావు, కాలనీ పెద్దలు పి.రాజు, శ్రీను, రాము, త్రినాథ, ఈశ్వరరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను సత్కరిస్తున్న రోటరీ ప్రతినిధులు

హామీల అమలు ఉత్తిదేనా?

ప్రజాశక్తి - వేపాడ

మీ గ్రామాల్లో క్వారీలు పెట్టుకునేందుకు అవకాశం కల్పిస్తే రోడ్లు బాగు చేస్తామని, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటి పర్యావరణానికి ఎటువంటి విఘాతం లేకుండా చూస్తామని చెప్పిన మాటలు నీటి మూటలవుతున్నాయి. ప్రజాభిప్రాయ సేకరణలో ఇచ్చిన హామీలను ఇటు అధికారులు, అటు క్వారీల యజమానులు అమలు చేయకపోడంతో రోడ్లు మరమ్మతులకు గురవుతున్నాయి. ఇటీవల మండలంలోని వీలుపర్తి, దుంగాడ రెవెన్యూ పరిధిలో ఉన్న రాతి క్వారీలు లీజుకు తీసుకునేందు ఆయా ప్రాంత గిరిజనులు, రైతులతో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. జిల్లా మైనింగ్ అధికారులు, క్వారీలు యజమాలు మీ గ్రామాలకు ఉన్న పాడైపోయిన రోడ్డును బాగు చేస్తాం, పొల్యూషన్ లేకుండా రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటుతాం, రోడ్డుపై ధూళి ఎగరకుండా రెండు పూటలా రోడ్డును వాటర్ ట్యాంక్‌తో తడుపుతాం, నెలకు రెండు సార్లు వైద్య శిబిరం ఏర్పాటు చేస్తాం, స్థానికులకు క్వారీలో పని కల్పిస్తాం అని నేటికి సుమారు పది సంవత్సరాలుగా మాటలు చెప్పడమే తప్ప ఏ ఒక్క పని చేసిన దాఖలాలు లేవు. సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డులో పెద్ద పెద్ద లారీల రాకపోకలు సాగించడం వల్ల రోడ్డు పూర్తిగా శిథిలమైంది. కనీసం నడవడానికి వీలు లేకుండా రాళ్ళు తేలిపోయి గుంతల పడటంతో గిరిజన గ్రామాలు ప్రజలు ఇబ్బంది పడుతున్నామని ఇప్పటికైనా ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులు ఇచ్చిన మాటలు నిలుపుకొని పాడైపోయిన రోడ్డును బాగు చేయించి గిరిజన గ్రామాల ప్రజలకు వేపాడ మండల కేంద్రానికి కార్యాలయకు రాకపోకలకు సౌకర్యం కలిగించాలని కోరుతున్నారు.

రాళ్లు తేలిపోయి ధూళితో ఉన్న వీలుపర్తి నుంచి కడకొండకు వెళ్లే రోడ్డు

బిటి రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని అప్పలంపేట నుంచి వంతరం వరకూ కోటి రూపాయలతో సుమారు కిలోమీటరు వేసిన బిటి రోడ్డును ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునా యుడుతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు సక్రమంగా లేక మండలంలోని శివారు గ్రామాలైన అప్పలంపేట, బూరిపేట ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారని వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రోడ్డు నిర్మించామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ప్రాంతాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతరం బూరి పేట నుండి గంగాడకు వెళ్లే మెటల్ రోడ్డును రూ.75 లక్షలు వ్యయంతో నిర్మించడానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఎన్ వెంకట్‌నాయుడు, మాజీ జెడ్‌పిటిసి, టిడిపి అధ్యక్షులు ఎన్ వెంకటేశ్వరరావు, పిఆర్‌డిఇ, ఎఇ, తెర్లాం ఎంపిటిసి జి.ఆనందరావు పాల్గొన్నారు.

రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

300 మందికి అన్నదానం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కొవ్వాడ సర్పంచ్, జనసేన నాయకుడు కోట్ల రఘు ఆధ్యాత్మిక సేవలో చురుగ్గా పాల్గొంటున్నారు. మండలంలోని కందివలస పంచాయతీలోని సాయిబాబా ఆశ్రమంలో ప్రతి నెలా మొదటి గురువారం జరిగే అన్నదానానికి ఆయన ఆర్థిక సహకారం అందిస్తున్నారు. గురువారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో సుమారు 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఇటీవల జరిగిన గురుపౌర్ణమి సందర్భంగా రూ.70వేలు విరాళం అందించడమే ఇందుకు నిదర్శనం. భక్తితతో కూడిన ఆయన సేవా దృక్పథం స్థానికులలో భక్తి, స్ఫూర్తిని నింపుతోంది.

అన్నదానం చేస్తున్న సర్పంచ్ రఘు

CHANGE OF NAME

I, undersigned **SANZEEDHA** (old name) D/o of Md. Azeezuddin, Door no. 1-1-23, Bowdara road, Cantonment, Vizianagaram Town, pincode 535003, Andhra Pradesh. Changing my name from **SANZEEDHA** (old name) to **SANZEEDHA BEGUM** (new name) shall hence forth I am being called as **SANZEEDHA BEGUM** (new name) D/o Md. Azeezuddin for all purposes.

IN THE HONOURABLE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION) CUM JUDICIAL MAGISTRATE OF FIRST CLASS AT KOTHAVALASA
E.P. 15/2024 in O.S.135/2022

Between:
Pinninti Kanaka Mahalaxmi ....D.Hr/Plaintiff
And:
Turpati Venkata Lakshmi & 2 others .....J.Drs/Defendants

NOTICE

To
J.Drs 1 to 3
1. Turpati Venkata Lakshmi, W/o late Turpati Appala Sanyasi Karunakarudu, D.No 4-21, B.C. colony, Goljam village, Lakkavarapukota Mandal, Vizianagaram District
2. Turpati Sunitha, D/o late Turpati Appala Sanyasi Karunakarudu, D.No 4-21, B.C. colony, Goljam village, Lakkavarapukota Mandal, Vizianagaram District
3. Turpati Sairam Kiran, S/o late Turpati Appala Sanyasi Karunakarudu, D.No 4-21, B.C. colony, Goljam village, Lakkavarapukota Mandal, Vizianagaram District.

Please take notice that the above EP, which is filed by the plaintiff/D.Hr against you under Order 21 Rule 64 to 66 CPC for sale of the E.P. schedule property, stands posted to **02-09-2025** for your notice. If you have any objection you may attend either personally or through an advocate before the above said Court at **10.30 A.M., on 02-09-2025,** failing which the matter will be decided exparte in your absence.

(By order of the court)

K.H. Raja Rao
Uggina Suryanarayana
Advocates, Kothavalasa
Vizianagaram
Kothavalasa,
Date: -7-8-2025
Cell: 9948511329, 9885986989

మహారాజశ్రీ గజపతినగరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.128/2024

Between :
గంట్యాడ పైడిపునాయుడు ....వాది
And :
దేవకోటి బంగారు లక్ష్మి ..... ప్రతివాది
To
ప్రతివాది :-
దేవకోటి బంగారు లక్ష్మి W/o శంకరరావు, వయస్సు 45 సం॥లు, గృహిణి, లెంకవీధి, విజయనగరం.

పై నెంబరు దావాను వాది అయిన గంట్యాడ పైడిపునాయుడు ప్రతివాది అయిన మీపైన శ్రీ గజపతినగరం సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ వారి కోర్టులో OS 128/2024 నెంబరు గల దావాను దాఖలు చేసుకొని యున్నారు. సదరు దావాలో మీరు కోర్టుకు సదరు **తే 29-8-2025దిన ఉదయం గం॥ 10-30 నిమిషాల**కు మీరు స్వయంగా కాని మీరు బోగట్టా ఇచ్చిన ప్లీడరు గారు ద్వారా కాని పై కోర్టులో హాజరు కావలసినదిగా ఆజ్ఞాపించడమైనది. పైన చెప్పబడిన తారీఖున మీరు హాజరు కాకుండా తప్పిన యెడల మీరు పరోక్షమందు పై దావా విమర్శ చేసి తీర్మానించుట జరుగునని మీరు తెలుసుకోవలసినది అని ఈ ప్రకటన ద్వారా తెల్పడమైనది.

K.RAMANAJI
Advocate,
Gajapathinagaram,
Cell : 9849343322